



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 277 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 10 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :277 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 10 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## ‘మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి

### క్షతగాత్రుడి మాటలతో కదిలిపోయాను

- విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- విశాఖలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన లోకేష్
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, శాశ్వత ఉద్యోగం హామీ
- కేంద్ర మంత్రి కుమారస్వామి, రాష్ట్ర మంత్రి లోకేష్ పరామర్శ
- ప్రమాద కారణాలపై ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలంటూ ఆసుపత్రిలో క్షతగాత్రుడి విజ్ఞప్తి

- మిగతా 2లో

## నేడు విశాఖ వెలుతున్న జగన్..

### స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు పరామర్శ

- మొన్న విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- ఎనిమిది మంది కార్మికుల దుర్మరణం
- ఘటనపై ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన జగన్



పెన్ పవర్ డెస్క్:విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని రేకెత్తించింది. ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను, అలాగే గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ రేపు విశాఖలో పర్యటించనున్నారు. ఈ ప్రమాదంపై జగన్ ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే ఆయన స్పందిస్తూ... బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని స్థానిక వైసీపీ నాయకులను

- మిగతా 2లో



## హైదరాబాద్ లో భారీ వర్షం... పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- తెలంగాణకు రెండ్రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ
- ఈదురుగాలులకు కూలిన చెట్లు, నిలిచిన విద్యుత్ సరఫరా
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

పెన్ పవర్ డెస్క్:నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందే తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, రాష్ట్రంలోని పలు

- మిగతా 2లో



## బాణసంచా గోదాంలో భారీ పేలుడు..

### ఏడుగురు కార్మికులు సజీవ దహనం

పెన్ పవర్ డెస్క్:రాజస్థాన్ రాష్ట్రంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం (జూన్ 9) జైపూర్‌లోని ఓ అక్రమ బాణసంచా గోదాంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు సజీవ దహనం అయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం

- మిగతా 2లో



# వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..

## పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్

- వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం
- పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం
- ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన
- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేం దుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ–పెర్ఫార్మెన్సు ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికా రులతో సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను మెరుగుపరచడమే కాకుండా, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. కేవలం నిర్దేశిత లక్ష్యాలే కాకుండా, వాస్తవ వృద్ధి (రియల్ గ్రోత్) ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేసేందుకు స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని సీఎం నిర్ణయించారు.రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలపై పెట్టే వ్యయం, ఆర్థిక కార్యకలాపాలను 3.5 రెట్లు పెంచేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వ్యవహారాలను రియల్ టైంలో

- మిగతా 2లో



## వైసీపీ ‘శవ రాజకీయాలు’ చేస్తోంది

- విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించిందన్న నారాయణ
- సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్ ఘటనను పర్యవేక్షిస్తున్నారని వెల్లడి
- 2029 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు మళ్లీ గుణపాఠం చెబుతారని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించిందని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న ఆయన, ఈ ప్రమాదం నేపథ్యంలో తాను తిరుపతిలో పాల్గొనాల్సిన అధికారిక కార్యక్రమాన్ని కూడా రద్దు చేసుకున్నట్లు వివరించారు. బాధితులకు మెరుగైన వైద్యం, తక్షణ సహాయక చర్యలు

- మిగతా 2లో



## ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాల సృష్టిపై హైకోర్టు ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్: ప్రభుత్వ భూములకు నకిలీపట్టాల సృష్టిపై సిట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఖానామెట్ భూములకు నకిలీ పట్టాలు సృష్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ భూమి తనదంటూ పిటిషన్ దాఖలు చేసిన ఇట్టిగా ప్రాపర్టీస్‌కు రూ. 5లక్షల జరిమానా

- మిగతా 2లో

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు



- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ఎనిమిది మంది చనిపోవడం బాధాకరమన్న బొత్స
- బాధితులు కోరుతున్న పరిహారం ఇవ్వాలని వ్యాఖ్య
- మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్

- మిగతా 2లో

## ఢిల్లీ హోటల్ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి

- ఆసుపత్రిలో ఉన్న కుటుంబ పెద్దను చూసేందుకు వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న బంధువులు
- ఈ విషయం తెలియకుండానే, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు కన్నుమూత
- ప్రమాదంతో గుర్గావ్ అగర్వాల్ కుటుంబంలో ఎవరూ మిగలకుండా పోయిన వైనం
- హోటల్ యాజమాని, వంట మనిషిని అరెస్ట్ చేసిన పోలీసులు

- మిగతా 2లో



### తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్

## రాజ్య సభ నామినేషన్ తిరస్కరణ

పెన్ పవర్ డెస్క్: రాజ్య సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైంది. తెలంగాణలో నమోదైన ఓ క్రిమినల్ కేసు వివరాలను నామినేషన్‌లో ఆమె వెల్లడించలేదని బీజేపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల సంఘం (ఈసీ) ఈ నిర్ణయం తీసుకుంది. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో బీజేపీ అభ్యర్థి ఎన్నిక

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# బెజవాడలో కమ్యునిస్టులు ఎక్కడ? నాడు శాసించి... నేడు

విజయవాడ అంటే ముందుగా గుర్తుకొచ్చేది కమ్యునిస్టులు. ఒకప్పుడు బెజవాడలో కమ్యునిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. విజయవాడ నగరంలో ఎక్కువగా కమ్యునిస్టు ఓటు బ్యాంకు ఉండేది. సీపీఎం, సీపీఐ బలంగా ఉండేవి. విజయవాడ నగర పాలక సంస్థను కూడా కమ్యునిస్టులు చేజిక్కించుకున్నారు. 1981 నుంచి 1999 వరకూ నగరపాలక సంస్థలో కమ్యునిస్టులు రాజ్యమేలారు. అన్ని డివిజన్లపై పట్టుండేది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సీపీఐ పలుమార్లు విజయం సాధించింది. కానీ 1999 లో టి. వెంకటేశ్వరరావు చివరి మేయర్ గా కమ్యునిస్టుల తరుపున పనిచేశారు. తర్వాత ఇంత వరకూ కార్పొరేషన్ కూడా దక్కలేదు.

**మారుతున్న పరిస్థితుల్లో...**

మారుతున్న రాజకీయ పరిస్థితుల కారణంతో కమ్యునిస్టుల ఓటు బ్యాంకు కూడా చెల్లాచెదురయినట్లు కనిపిస్తుంది. విజయవాడలో కమ్యూనిస్టులు పూర్తిగా కనుమరుగయ్యారని చెప్పలేం కానీ, వారి ప్రాభవం మాత్రం కాలక్రమేణా భారీగా తగ్గిపోయింది. ఒకప్పుడు బెజవాడను శాసించిన కమ్యూనిస్టు పార్టీలు, నేడు స్వతంత్రంగా గెలిచే స్థాయిని కోల్పోయి, ప్రధాన పార్టీలతో పొత్తుల మీదే ఆధారపడే స్థితికి చేరుకున్నాయి. బెజవాడలో కమ్యూనిస్టుల పరిస్థితికి సంబంధించిన ముఖ్య విషయాలు:దశాబ్దాల క్రితం ఆధిపత్యం: స్వాతంత్రోద్యమ కాలంలో, ముఖ్యంగా 1934లో విజయవాడలోనే ఆంధ్రా కమ్యూనిస్టు ఉద్యమం పురుడు పోసుకుంది. 1980లు, 90ల వరకు నగరపాలక సంస్థలో తిరుగులేని శక్తిగా ఉండేవి. విజయవాడకు తొలి మేయర్‌గా సీపీఐ నేత టి.వెంకటేశ్వరరావు పనిచేయడం దీనికి నిదర్శనం.

**ఆధిపత్య పోరుతోనే...**

సీపీఐ, సీపీఎంల మధ్య ఆధిపత్య పోరు, కార్మిక సంఘాల్లో తగ్గిన పట్టు, మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల నగరంలో వీరి ఓటు బ్యాంకు గణనీయంగా పడిపోయింది.ప్రత్యక్ష ఎన్నికల్లో విజయాలు అంతంత మాత్రమే అయినప్పటికీ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరసనలు, పోరాటాల్లో వామపక్షాలు ఇప్పటికీ క్రియాశీలకంగానే పనిచేస్తున్నాయి. అయినా సరే కమ్యునిస్టులు గెలిచేటంతగా తమ బలాన్ని పెంచుకోలేకపోతున్నాయి. ప్రజాసమస్యలపైన, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్నప్పటికీ కమ్యునిస్టులకు ఓట్లు రాలడం లేదు. దీంతో పట్టున్న బెజవాడ నగరం ఎర్రన్న చేతుల్లో నుంచి చేజారిపోయినట్లే కనిపిస్తుంది. ఇక పుంజుకునే అవకాశాలు కూడా కనిపించడం లేదు. టీడీపీ, వైసీపీ, బీజేపీలు క్రమంగా బలపడటంతో కమ్యునిస్టుల ఓటు బ్యాంకు చెల్లాచెదురయింది.

# ‘మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసాను వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, కాంట్రాక్ట్ లేదా పర్మనెంట్ అనే తేడా లేకుండా మృతుల కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు.కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించిన వివరాలను లోకేష్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనంగా రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రతి కుటుంబానికి అందిస్తున్నట్లు తెలిపారు. నిన్న రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించిన కుమారస్వామి, ఈ మేరకు హామీ ఇచ్చారని చెప్పారు. కుటుంబంలో చదువుకున్న వారికి పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నిబంధనల గురించి ప్రస్తావించగా, “అవసరమైతే కేబినెట్‌కు తీసుకెళ్లైనా దీన్ని సాధిస్తాను, ఇది నా బాధ్యత” అని కుమారస్వామి స్పష్టం చేశారని లోకేష్ వివరించారు.ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి చేతులు దులుపుకోదని, బాధితులకు శాశ్వతంగా అండగా నిలుస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. “నిన్న సాయంత్రం 4:10 గంటలకు ప్రమాదం జరగగానే కలెక్టర్, సీపీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోం మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, పల్లా శ్రీనివాస్ కూడా వచ్చారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, వర్మ కూడా వెంటనే స్పందించి పరిస్థితిని సమీక్షించారు. కుమారస్వామి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు, ఈరోజు తేదీ మారేలోపే 8 మంది మృతుల కుటుంబాల అకౌంట్లలోకి తక్షణ సాయంగా రూ.25 లక్షలు జమ చేస్తాం. దీనితో పాటు పీఎఫ్, స్టీల్ ప్లాంట్ నిబంధనల ప్రకారం రావాల్సిన మిగతా పరిహారం కూడా త్వరలోనే అందిస్తాం” అని తెలిపారు.

ప్రమాదం జరిగిన తీరుపై లోతైన దర్యాప్తు జరుగుతుందని లోకేష్ అన్నారు. “ఇది కింద నుంచి లీకవ్వలేదు, పైనుంచి పొంగలేదు. ద్రవ ఉక్కు బయటకు కక్కినట్లుగా ఉంది. దీని వెనుక కారణాలను నిగ్గు తేల్చేందుకు ముగ్గురు సీనియర్ అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని వేశారు. వారు ఈరోజే విశాఖ వచ్చి కార్మికులతో మాట్లాడి నివేదిక సమర్పిస్తారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయి” అని వివరించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగిన ఓ సంఘటనను లోకేష్ ఉద్వేగంగా పంచుకున్నారు. “గాయపడిన శ్రీనివాస్ అనే కార్మికుడిని పరామర్శిస్తే, ఆయన తన ఆరోగ్యం గురించి కాకుండా ‘అయ్యా, మమ్మల్ని కాదు, దయచేసి విశాఖ ఉక్కును కాపాడండి. లక్షలాది కుటుంబాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి’ అని వేడుకున్నాడు. ఆ మాటలు కార్మికులకు ఫ్యాక్టరీతో ఉన్న అనుబంధాన్ని తెలియజేశాయి. ఆయన మాటలు నన్ను కదిలించాయి” అని అన్నారు.గతంలో వాజ్‌పేయి, చంద్రబాబు హయాంలో రూ.15 వేల కోట్ల ప్యాకేజీతో ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కార్మికుల కుటుంబాలకు అదే విధంగా ఎన్డీయే ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్రకు రానున్న భారీ పెట్టుబడుల నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, యువతకు శిక్షణ ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని లోకేష్ హామీ ఇచ్చారు.

# ఢిల్లీ హోటల్ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి

ఢిల్లీలో ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాద విషాదంలో మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తన కుటుంబ సభ్యులు ఎనిమిది మందిని కోల్పోయిన 80 ఏళ్ల రాధే శ్యామ్ అగర్వాల్, ఆ చేదు నిజం తెలియకుండానే మంగళవారం కన్నుమూశారు. దీంతో గురుగ్రామ్‌కు చెందిన అగర్వాల్ కుటుంబం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది.

శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న రాధే శ్యామ్ అగర్వాల్ ఢిల్లీలోని సాకేత్ మాక్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను చూసుకునేందుకు గురుగ్రామ్‌లో నివసించే ఆయన కుమారుడు వివేక్ అగర్వాల్, కోడలు, మనవరాళ్లతో సహా మొత్తం ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఢిల్లీకి వచ్చారు. వీరంతా ఆసుపత్రికి సమీపంలోని మాల్వియా నగర్‌లో ఉన్న ‘ఫ్లరిష్ స్టే’ అనే హోటల్‌లో బస చేశారు.

జూన్ 3న ఉదయం 8:30 గంటల సమయంలో ఆ హోటల్‌లోని వంటగదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వివేక్ అగర్వాల్ కుటుంబ సభ్యులు ఎనిమిది మందితో పాటు మొత్తం 21 మంది ప్రాణాలు కోల్పోయారు. తన కుటుంబానికి ఇంతటి ఘోరం జరిగిందన్న విషయం తెలియని రాధే శ్యామ్, తన వాళ్లెవరూ పలకరించడానికి రావడం లేదని ఆసుపత్రి సిబ్బందిని నిరంతరం ఆరా తీస్తుండేవారు. చివరకు ఆయన కూడా చికిత్స పొందుతూ మృతి చెందడంతో, ఆ కుటుంబంలో ఒక్కరు కూడా మిగలకుండా పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు, హోటల్ యజమాని లవకేశ్ బజాజ్, వంట మనిషి కేశవ్ నేగిని అరెస్ట్ చేశారు. భవన నిర్మాణం, అగ్నిమాపక భద్రతా నిబంధనల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ దుర్ఘటనతో గురుగ్రామ్‌లోని అగర్వాల్ కుటుంబ నివాసం మూగబోయింది.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు

విశాఖ స్టీల్ ప్లాంట్ ఘోర ప్రమాదంలో గాయపడి కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, కేకే రాజులతో కూడిన బృందం పరామర్శించింది. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడుతూ... ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. బాధితులు కోరుతున్న పరిహారం గొంతెమ్మ కోరిక కాదని, ప్రభుత్వం వారి డిమాండ్లను తక్షణమే అంగీకరించాలని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్టీల్‌ప్లాంట్‌ను తమ తాబేదార్లకు కట్టబెట్టేందుకు, ప్రైవేటీకరణ చేసేందుకే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈ కుట్రల వల్లే ప్లాంట్‌లో వరుస ప్రమాదాలు జరుగుతూ కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆరోపించారు.

స్టీల్ ప్లాంట్ నుంచి సమర్థులైన, అనుభవజ్ఞులైన అధికారులను దొడ్డిదారిన బదిలీ చేయడం వల్లే ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుందని బొత్స విమర్శించారు. ఇప్పటికే దాదాపు 10 వేల మంది శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించారని, ఇకనైనా బలవంతపు వీఆర్ఎస్ చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ‘ఎల్జీ పాలిమర్స్’ తరహాలో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఈ విషయంలో వైసీపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చి చెప్పారు. అలాగే, బాధితులను పరామర్శించేందుకు జగన్ రేపు విశాఖలో పర్యటిస్తారని వెల్లడించారు.

# బాణసంచా గోదాంలో భారీ పేలుడు.. ఏడుగురు కార్మికులు సజీవ దహనం

మొదటి పేజి తరువాయి

అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించారు. జైపూర్‌లోని తలాయ్ కాలనీలో అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచిన ఓ ఇంట్లో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. భారీ పేలుడు తర్వాత మంటలు వేగంగా వ్యాపించడంతో పలువురు కార్మికులు లోపల చిక్కుకుపోయారని తెలిపారు. ఏడుగురూ కాలిన గాయాలతో మరణించారని జైపూర్ ఏసీపీ వినోద్ శర్మ ధృవీకరించారు.

వీరిలో ఐదుగురు ఎస్ఎంఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించగా.. ఒకరు అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. మరొకరు ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. మృతులను సమీర్, ఆబిద్, నాసిర్, అబ్దుల్ వాహిద్, బిలాల్‌గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిల్వ ఉంచిన అత్యంత మండే స్వభావం గల పదార్థం పేలుడుకు కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. పేలుడు తర్వాత భారీగా ఎగసిపడుతోన్న మంటల నుంచి తప్పించుకోవడానికి కార్మికులు పరుగులు తీయడంతో అక్కడ భయానక వాతావరణం నెలకొందని ప్రత్యక్ష సాక్షులు వివరించారు. అగ్నిమాపక సిబ్బంది రాకముందే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి లోపల చిక్కుకున్న పలువురిని బయటకు తీశారు. కాగా, ఈ ఘటనపై రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ, మాజీ సీఎం అశోక్ గ్లెహాట్ సంతాపం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాల సృష్టిపై హైకోర్టు ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

విధించింది. నకిలీ పట్టాల వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్రపైనా సీఐడీ దర్యాప్తునకు ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.ఈ వ్యవహారంపై ఐపీఎస్ అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని జస్టిస్ నగేశ్ భీమపాక ఆదేశాలు ఇచ్చారు. గతంలో టీజీఐఐసీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ ఇట్టిగా ప్రాపర్టీస్ అనే సంస్థ హైకోర్టులో సవాల్ చేసింది. ఖానామెట్‌లో 15 ఎకరాలను కొనుగోలు చేశామని పిటిషన్ వేసింది. అయితే, ఖానామెట్‌లో ఈ భూమిని 1997లోనే టీజీఐఐసీకి ప్రభుత్వం కేటాయించడం గమనార్హం.

# వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..

- మొదటి పేజి తరువాయి

పర్యవేక్షించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా పంచుకున్నారు.

2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల వంటి కీలక ప్రాజెక్టులతో ఆర్థిక వ్యవస్థకు ‘మల్టిప్లైయర్ ఎఫెక్ట్’ తీసుకురావాలని సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటేనే రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రతి రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు.

## నేడు విశాఖ వెలుతున్న జగన్..

- మొదటి పేజి తరువాయి

ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు పార్టీ శ్రేణులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నిన్న సాయంత్రం స్టీల్‌ప్లాంట్‌లో ఒక పెద్ద పేలుడు సంభవించింది. 150 టన్నుల లాడిల్ నుండి కరిగిన ఉక్కు ఒక్కసారిగా కిందపడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా... మరో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

## హైదరాబాద్ లో భారీ వర్షం... పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- మొదటి పేజి తరువాయి

జిల్లాలకు భారత వాతావరణ శాఖ ‘ఎల్లో అలర్ట్’ జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం కూడా వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఇదే తరహా వాతావరణం కొనసాగనుంది. వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**హైదరాబాద్‌లో భారీ వర్షం**

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న భాగ్యనగరవాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, హైటెక్ సిటీ, చందానగర్, ముషీరాబాద్, లక్డీకాపూల్, సరూర్‌నగర్, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, ట్యాంక్ బండ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బాగ్ లింగంపల్లి, రాంనగర్ సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలుల ధాటికి రాంనగర్ వీఎస్టీ రోడ్డు, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముషీరాబాద్‌తో పాటు నగరంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## వైసీపీ ‘శవ రాజకీయాలు’ చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

అందించడంపైనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ ఘటనను పర్యవేక్షిస్తున్నారని నారాయణ పేర్కొన్నారు. అయితే, ఈ విషాదాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ దారుణమైన శవ రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికిన ఆయన, 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు మళ్లీ తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇక గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన 56 ఫిర్యాదుల్లో 60 శాతానికి పైగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకల వల్లే ప్రజలు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని, వీటి పరిష్కారానికి మంత్రుల కమిటీ పనిచేస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు వారానికోసారి దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నారని, వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

## తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్య సభ నామినేషన్ తిరస్కరణ

- మొదటి పేజి తరువాయి

ఏకగ్రీవమైంది.కాగా, మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్య సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం రెండు స్థానాలను బీజేపీ సునాయాసంగా కైవసం చేసుకోనుండగా.. ఒక స్థానం కాంగ్రెస్?కు దక్కే అవకాశం ఉంది. ఈ మూడో సీటు కోసం కాంగ్రెస్ తరుపున మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే, హైదరాబాద్?లో నమోదైన క్రిమినల్ కేసు వివరాలు, ఆస్తులు, బ్యాంక్ లావాదేవీల వివరాలను ఉద్దేశపూర్వకంగానే మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాల్లో దాచిపెట్టారని బీజేపీ అభ్యర్థి ఈసీకి ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదును పరిశీలించిన రిటర్నింగ్ ఆఫీసర్ మీనాక్షి నటరాజన్ నామినేషన్?ను రిజెక్ట్ చేశారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ పరిశీలన ప్రక్రియలో తిరస్కరణకు గురి కావడంతో మధ్యప్రదేశ్?లోని మూడవ రాజ్యసభ స్థానానికి కూడా పోటీ ముగిసింది. బీజేపీ అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఈసీ ప్రకటించింది. నామినేషన్ తిరస్కరణపై న్యాయపరంగా పోరాటం చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# కొత్తమ్మ తల్లి ఆలయంలో అన్న ప్రసాదం



**టెక్కలి, పెన్ పవర్ జూన్ 9 :** కోటబొమ్మాళి మండల కేంద్రం లోని శ్రీ కొత్తమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం 150 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయంలో ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ఉంటారు. అయితే మంగళవారం కూడా భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడం గుర్తించిన ఆలయ కార్యనిర్వహక అధికారి వాకచర్ల రాధాకృష్ణ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండుటెండలో సుదూర ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులు కొంతసేపు సేదతీరి అన్న ప్రసాదంలో పాల్గొని ఆనందంగా వెళుతున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొత్తమ్మ తల్లి తన వద్దకు వచ్చే భక్తులకు కడుపు నింపుతుందని భక్తులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదం అత్యంత విషాదకరం

- **మృతుల కుటుంబాలకు రూ.1 కోటి నష్టపరిహారం, కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలి**
- **అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ జి. తనూజ రాణి**



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు/గూడెం కొత్తవీధి, పెన్ పవర్,జూన్ 9:**విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ యూనిట్ వద్ద జరిగిన ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజ రాణి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన మరో ఆరుగురు కార్మికులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఇంత భారీ ప్రమాదం చోటుచేసుకోవడానికి భద్రతా ప్రమాణాల అమలులో లోపాలు, భద్రతా వైఫల్యాలే కారణమా అనే అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఈ ఘటనపై పూర్తి బాధ్యత వహించి, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబాల పునరావాసానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం అందించడంతో పాటు, కుటుంబంలోని ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని డాక్టర్ జి. తనూజ రాణి డిమాండ్ చేశారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాలకు అండగా ఉంటారని ఆమె పేర్కొన్నారు.

# మృతుల కుటుంబాలను ఆదుకుంటాం




**-ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఐటి, విద్య శాఖ మాత్యులు నారా లోకేష్**

**కుర్మాన పాలెం :పెన్ పవర్, జూన్ 09:**విశాఖ ఉక్కు కర్మాగాలంలో ప్రమాదం జరిగిన స్థలాన్ని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , హోం మినిస్టర్ అనిత , రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు , ఎంపీ భరత్ ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగడ సానుభూతి తెలిపారు. ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ జరిగిన ప్రమాదం పై దర్యాప్తు జరిపించి ప్రమాదానికి కారణం తెలుసుకుని న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం , ప్రగడ దానయ్య, గండేపల్లి రాము, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడు జిల్లాలను అనుసంధానించే సెమీ రింగ్ రోడ్డుకు వేగం

**జూన్ నెలాఖరులోపు తుది అలైన్మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలని వీఎంఆర్డీఏ కమిషనర్ ఆదేశం**




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్09 :** విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లా లను అనుసంధానించే ప్రతిష్ఠాత్మక 120 అడు గుల విస్తీర్ణం గల సెమీ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ మంగళవారం సమీక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భవిష్యత్తు ట్రాఫిక్ రద్దీ నియం త్రణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాంబిల్లి నుంచి భోగాపురం వరకు ప్రతిపాదిం చిన సెమీ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించి తుది అలైన్మెంట్ ప్లాన్‌ను ఈ నెలాఖరులోపు సిద్ధం చేయాలని సంబంధిత కన్సల్టెంట్‌ను ఆదేశించారు.అదేవిధంగా రహదారి మార్గంలో అవసరమైన మైనర్, మేజర్ వంతెనల నిర్మాణ అవసరాలను గుర్తించి నివేదికలో పొందుపరచా లని సూచించారు. ప్రాజెక్టు అభివృద్ధికి అవస రమైన భూముల వివరాలను కూడా పూర్తి స్థా యిలో తుది ప్రణాళికలో చేర్చాలని ఆదేశిం చారు.ఈ సమీక్ష సమావేశంలో ఓఎస్డీ కృష్ణ నాయక్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షణ ఇంజనీర్ మధుసూదన రావు, కార్యనిర్వహక ఇంజనీర్ దుర్గాప్రసాద్, ప్లానింగ్ అధికారులు మౌనిక, రోహిణి, కిషోర్, ఎస్టేట్ విభాగ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సెమీ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే మూడు జిల్లాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు భవిష్య త్తులో ట్రాఫిక్ రద్దీ సమస్యలకు సమర్థవంత మైన పరిష్కారం లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటన దురదృష్టకరం

**మంత్రి వాసంశెట్టి సుభాష్**




**విశాఖ, పెన్ పవర్, జూన్ 09 :**విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాద ఘటన దురదృష్టకరమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిని సందర్శించి, ప్రమాదం లో గాయపడిన కార్మికులను పరామర్శించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రమా దంలో గాయపడిన ముగ్గురు ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యు లను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రమా దంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని, గాయపడిన వారికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని వెల్లడించారు.కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన సమ యంలో అవసరమైన సంఖ్యలోనే కార్మికులు విధుల్లో ఉన్నారని చెప్పారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలిస్తున్నారని, ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసా గుతోందన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంద ని మంత్రి వాసంశెట్టి సుభాష్ భరోసా ఇచ్చారు.




# స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ప్రభుత్వం

**కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 9:**విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన లాడిల్ బ్లాస్ట్ ఘటనలో మృతి చెందిన కార్మికుల కుటుంబా లకు, గాయపడిన వారికి ప్రభుత్వం అన్ని విధా లుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు.కేజీహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన అనం తరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జూన్ 8 సాయంత్రం స్టీల్ మెల్ట్ షాప్-1లో జరిగిన ప్రమాదంలో 8 మంది కార్మికులు మృతి చెందగా, 6 మంది తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. గాయపడిన వారికి కిమ్స్, సెవెన్ హి ల్స్ ఆసుపత్రుల్లో అత్యుత్తమ వైద్యం అందిస్తు న్నట్లు తెలిపారు.మృతుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ప్రకటించిన ఆర్థిక సహాయం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. టెర్మినల్ బెనిఫిట్స్‌తో పాటు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, పిల్లలకు ఉచిత విద్య, నివాస సదుపాయం కొనసాగింపు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యో గం కల్పించే నిర్ణయాల అమలుపై చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ప్రమాద కారణా లపై కేంద్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ విచారణ ప్రారంభించిందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.బాధిత కుటుంబాల అవస రాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అంత్యక్రియలు, రవాణా, వైద్య చికిత్స తదితర అంశాల్లో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## టెక్కలి తహసిల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నాయకులు




**టెక్కలి, పెన్ పవర్ జూన్ 9 :** టెక్కలి మండల తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన రాంబాబు ను మంగళవారం బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా దుస్సాలువతో సత్కరించి, భగవద్గీత పుస్తకాన్ని బహుకరించారు. అనంతరం బిజెపి నాయకులు తహసిల్దార్ తో కొంత సమయం ముచ్చటించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న ప్రజా సమస్యలు, అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా బిజెపి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి బీజేపీ మండల అధ్యక్షులు, కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్జాన రాంజీ, జిల్లా ఉపాధ్యక్షులు నడుపూర్ లక్ష్మీనారాయణ, యువ మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు దూపాన రాజకుమార్, మండల ప్రధాన కార్యదర్శి నీతింటి రాజారావు, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలి




**టెక్కలి, పెన్ పవర్ జూన్ 9 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజల్, వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. వామపక్షాలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం టెక్కలి మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షణ్ముఖరావు మాట్లాడుతూ ధరలు వెంటనే తగ్గించకపోతే దశల వారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ, టీడీపీ కూటమి ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని వాగ్దానం చేశారన్నారు. అధికారంలో వచ్చిన వెంటనే ధరలు పెంచి ప్రజలను టిడిపి బిజెపి పార్టీలు మోసం చేస్తున్నాయన్నారు. పది రోజుల్లో నాలుగు సార్లు పెట్రోల్ డీజిల్ ధరలు రెండుసార్లు వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపారని అన్నారు. కేంద్రంలో మోడీ సర్కార్ ట్రంప్ ఆంక్షలకు తలొగ్గి ఇరాన్, రష్యా నుంచి చౌకగా వచ్చే ఆయిల్ గ్యాస్ దిగుమతిని నిలుపుదల చేయడం వల్ల మనకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొల్లి యల్లయ్య, రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావు, బి. కృష్ణారావు, జన్ని కృష్ణారావు, ఉర్జాన లక్ష్మణరావు, హెచ్. ఈశ్వరరావు, మెట్ట లక్ష్మణ దాసు, మాధవ, ప్రసాద్, అడ్వకేట్ మల్లేశ్. టి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాజముద్రతో కొత్త పాస్‌పుస్తకాలు

- రాజముద్ర తో కొత్త పాసు పుస్తకాలను
- రాకోటలో పంపిణీ చేసిన ఎంపీపీ అనూష దేవి, పీఏసీఎస్ చైర్మన్ అబ్బాయి నాయుడు, తహసీల్దార్ త్రివేణి.



**చింతపల్లి పెన్ పవర్ జూన్ 9.** భూముల రీసర్వే పూర్తి చేసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక రాజముద్రతో రూపొందించిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను చింతపల్లి మండలంలోని కిటుముల పంచాయతీ రాకోట గ్రామ రైతులకు మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు. తహసీల్దార్ హనుమంతు త్రివేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ కోరాబు అనూషాదేవి, పీఏసీఎస్ చైర్మన్ గెమ్మెలి అబ్బాయినాయుడు ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు స్వయంగా పాస్‌పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ సమగ్ర భూ రీసర్వేతో ఎన్నాళ్లుగానో ఉన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. గతానికి భిన్నంగా పాస్‌పుస్తకాలపై ఎలాంటి రాజకీయ నాయకుల బొమ్మలు లేకుండా కేవలం ప్రభుత్వ రాజముద్రతో వీటిని పారదర్శకంగా అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. రికార్డులు పక్కాగా ఉండటం వల్ల రైతులకు తమ భూములపై పూర్తి భద్రత ఏర్పడుతుందని, తద్వారా బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడం మరింత సులభతరం అవుతుందని వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా, సొంత ఊళ్లోనే అధికారుల చేతుల మీదుగా పాస్‌పుస్తకాలు అందుకోవడంపై రాకోట రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పద్మ, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కోరాబు అంగదరావు, నాయకులు రామారావు, అప్పన్న పడాల్, లోచలి సత్యనారాయణ, చంద్రరావు, మాదేల రామరాజు పాల్గొన్నారు. అలాగే రెవెన్యూ శాఖ నుంచి రీసర్వే ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసీల్దార్ బాలరాజు దొర, ఆర్ఐ కృష్ణమూర్తి, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శి, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

# జర కొండ గ్రామ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

- జనసేన నాయకులు కోటేశ్వరరావు పడాల్

**హుకుంపేట పెన్ పవర్ జూన్ 9 :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం జర్రకొండ పంచాయతీ జర్రకొండ గ్రామాన్ని హుకుంపేట మండల జనసేన పార్టీ అధ్యక్షులు మరియు ఏఎంసీ డైరెక్టర్ కోటేశ్వరరావు పడాల్ సందర్శించారు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తున్నామని, వృద్దులకు నాలుగు వేల రూపాయలు,వికలాంగులకు ఆరు వేలు, అలాగే గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల కాలంలో కేవలం తొంభై ఐదు వేల రూపాయలు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం రెండు సంవత్సరాల కాలంలోనే వెయ్యి ఐదు కోట్లతో రోడ్లు వేస్తున్నామని అన్నారు.

సమావేశంలో గ్రామంలో తీవ్రంగా మంచి నీటి సమస్య ఉందని, గ్రామానికి బీటి రోడ్డు సదుపాయం, పాఠశాల భవనం కల్పించాలని



వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో శరభ ప్రసాద్ మండలకార్యదర్శి, అప్పారావు. జర్రకొండ పంచాయతీ ఇంచార్జ్, వెంకట్, కొండలరావు జనసైనికులు, బాబ్జి బి బొడ్డపుట్టు పంచాయతీ ఇంచార్జ్, శిరగం పొట్టిదొర జనసైనికులు, పాతుని ఎందు పాత్రుడు మాజీ సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెద్ది సినిమా డైరెక్టర్, నిర్మాత, మాటల రచయితలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.




- గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు శశి కుమార్, కోటి బాబు.

**చింతపల్లి పెన్ పవర్ జూలై 9.** ఇటీవల విడుదలైన పెద్ది సినిమా డైరెక్టర్, నిర్మాత, మాటల రచయితలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు దీపూరు శశి కుమార్, సాగిన కోటి బాబు చింతపల్లి ఏ ఎస్ పి నవజ్యోతి మిశ్రాకు ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ పెద్ది సినిమాలు గిరిజనుల భావాలను దెబ్బతీసే విధంగా పదజాలం వాడారు అన్నారు. గిరిజనులను చిన్నచూపు చూస్తూ వారిని అసభ్య పదమైన కొండనా కొడుకు అని తిట్టడం, కొండ నా కొడుకు కాళ్లు పట్టుకోవడం అనే పదాలు ఈ సినిమాలు చిత్రీకరించారన్నారు. ఈ పదాలను తక్షణమే సెన్సార్ బోర్డు కల్పించుకుని తొలగించాలని అన్నారు. ఈ పదాలు పదేపదే సినిమాలో వాడటం వల్ల గిరిజనుల యొక్క మనోభావాలు దెబ్బతిన్నాయని గిరిజనుల మనస్సును నొప్పించే ఈ విషయాలను వెంటనే సినిమా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే సినిమా డైరెక్టర్ పై, నిర్మాత, మాటల రచయితలపై కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. గిరిజనుల మనోభావాలను దెబ్బతీసే కొండ నా కొడుకు వంటి పదజాలలను తక్షణమే సినిమా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతర్ల మధుబాబు, ట్రైబల్ శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంటా బాలకృష్ణ, దేపూరు సునీల్ కుమార్, తెలుగుదేశం పార్టీ చింతపల్లి గ్రామ నాయకుడు రీమల ఆనందరావు, కిముడు మహేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు పాంగి రాంబాబు మండల తెలుగుదేశం నాయకులు వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## జీవో నెం.3 అమలు, అల్లూరి జిల్లాను జోన్-1లో కొనసాగించాలని కేంద్ర మంత్రికి వినతి



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/చింతపల్లి,పెన్ పవర్,జూన్ 9:** గిరిజనుల సమస్యల పరిష్కారం, జీవో నెం.3 అమలు, అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1లోనే కొనసాగించాలంటూ జనసేన పార్టీ పెదబరడ పంచాయతీ అధ్యక్షుడు కూడ రామకృష్ణ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడికి వినతిపత్రం అందజేశారు.శ్రీకాకుళం జిల్లా రాపాకలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన రామకృష్ణ, గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా జీవో నెం.3 అమలు, అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1 పరిధిలోనే కొనసాగించాల్సిన అవసరాన్ని వివరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, విద్యా సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై కూడా చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎస్ఈఆర్పీ, ఎన్ఆర్ఐ సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి గిరిజనుల సమస్యలపై వినతిపత్రం సమర్పించి చర్చించారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ ఆముదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెడాడ రామ్మోహన్ రావు రామకృష్ణను మంత్రులకు పరిచయం చేశారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొంచాడ చిన్నం నాయుడు, సత్తిబాబు, సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ స్క్రీనింగ్ పై అంగనవాడి టీచర్లకు అవగాహన కార్యక్రమం.






- ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్. శ్రీదేవి.

**చింతపల్లి పెన్ పవర్ జూన్ 9.** ఏఐ ఆధారిత స్క్రీనింగ్ పై రెండవ రోజు శిక్షణా కార్యక్రమాన్ని రాజుపాకలు, బెన్నవరం, భీమసింగి, నిమ్మలపాడు, లంబసింగి సెక్టార్ కి చెందిన 120 మంది అంగన్వాడీ టీచర్లకు ఏఐ ఆధారిత స్క్రీనింగ్ పై అవగాహన కల్పించడం జరిగిందని సిడిపిఓ సిహెచ్ శ్రీదేవి అన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ప్రభావతి హాజరై ఏఐ సాంకేతికత వినియోగం పిల్లల అభివృద్ధి మరియు స్క్రీనింగ్ ప్రక్రియలు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారన్నారు. అంగన్వాడీ టీచర్లకు చిన్నారుల ఆరోగ్య అభివృద్ధి సమస్యలను ప్రారంభించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధి సంబంధిత సమస్యలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వేగంగా గుర్తించే విధానాలను వివరించడం జరిగిందన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో సేవలు పొందుతున్న చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఏఐ స్క్రీన్ టెస్ట్ ఎంతో ఉపయోగకరమని ఆమె అన్నారు. అంగన్వాడీ టీచర్లకు యాప్ వినియోగం, డేటా నమోదు, స్క్రీనింగ్ ప్రక్రియ, ఫలితాల విశ్లేషణ తదితర అంశాల పైన చిన్నారుల అభివృద్ధిలో ఏవైనా లోపాలు గుర్తించినట్లయితే వెంటనే సంబంధిత వైద్య సేవలకు అనుసంధానం చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సూపర్వైజర్లు జి సౌజన్య, డి తులసి, డి జయ భారతి, ఎస్ గౌరీ, ఎం లక్ష్మి, సీనియర్ సహాయకుడు శర్మ, బీపీసీ జి రమ పాల్గొన్నారు.

## ఘనంగా ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా వర్ధంతి



**హుకుంపేట పెన్ పవర్ జూన్ 9 :** అల్లూరి జిల్లా హుకుంపేట మండలం కేంద్రం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో భగవాన్ బిర్షముండా 126వ వర్ధంతి కార్యక్రమం గిరిజన సంఘం కార్యాలయం లో నిర్వహించారు ముండా చిత్రపటానికి పూలమాల చేసి ఘనంగా నివాళులు అర్పించారు అని ఆదివాసీ సంఘ కార్యదర్శి టి క్రిష్ణరావు తెలిపారు ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.

భగవాన్ బిర్షముండా ఆదివాసి ముద్దు బిడ్డ.ముండా గిరిజన జాతికి చెందిన,జానపద నాయకుడు,ఈయన 1875 జన్మించాడు.ఈయనకు భీర్షా భగవాన్ అని కూడా పిలుచుకునే వారు అన్నారు. అంతేకాకుండా ప్రముఖ ఆదివాసి స్వాతంత్ర్య సమరయోధుడు అన్నారు ఆయన 1900 సంవత్సరం జూన్9న అయన మరణించారున్నారు 25 సంవత్సరాలకే మరణించారన్నారు,ఆయన స్ఫూర్తితో ఆదివాసుల హక్కులు సాధనకు గిరిజనులు ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి గిరిజన సంఘం నాయకులు పి లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## 28 మంది రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ




**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 9:** మండలంలోని ఎ.ధారకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని చెలికవీధి గ్రామంలో భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గత రెండేళ్ల క్రితం నిర్వహించిన రీ-సర్వేలో అర్హత సాధించిన 28 మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీటీసీ సభ్యులు అంపురంగి బుజ్జిబాబు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేశారు. భూములకు సంబంధించిన రికార్డులను సక్రమంగా భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ దుమంతి సత్యనారాయణ, వీఆర్వో ఈశ్వరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు. భూహక్కు పత్రాలు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# స్టీల్ ప్లాంట్ మృతులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు చెల్లించాలి...!

**అరకు పార్లమెంటు సభ్యురాలు తనుజారాణి డిమాండ్**

**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 9 :** స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం అత్యంత విషాదకరం
మృతుల కుటుంబాలకు రూ.1 కోటి నష్టపరిహారం, కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలి అని
అరకు పార్లమెంట్ సభ్యురాలు జి. తనూజ రాణి అన్నారు.
విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ యూనిట్ వద్ద జరిగిన ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని అరకు పార్లమెంట్ సభ్యురాలు జి. తనూజారాణి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో మరో ఆరుగురు గాయపడడం కూడా విచారకరమని పేర్కొంటూ, వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.
ఇంత భారీ ప్రమాదం జరగడానికి భద్రతా ప్రమాణాల అమలులో లోపాలు, భద్రతా వైఫల్యాలే కారణమా అనే కోణంలో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఈ ఘటనపై పూర్తి బాధ్యత వహించి, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు.
అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి బాధిత కుటుంబాల పునరావాసానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం అందించడంతో పాటు, కుటుంబంలోని ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని తనూజారాణి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా
మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి, నాయకులు బాధిత కుటుంబాలకు అండగా ఉంటాము అని పేరుకొన్నారు.





## తాసిల్దార్ ను కలిసిన వైసిపి పార్టీ మాజీ మండల అధ్యక్షులు



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 9:** నూతన తాసిల్దారును మర్యాదపూర్వకంగా కలిసిన వైసిపి పార్టీ మాజీ మండల అధ్యక్షులు జల్లి బాబులు. మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో వైసీపీ పార్టీ మాజీ మండల అధ్యక్షులు తాసిల్దార్ కె ప్రసాద్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం మండలంలోని ఉన్న 33 పంచాయితీ లలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన తాసిల్దార్ త్వరలోనే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంటు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు తెలియకుండా రీసర్వే చేపట్టవద్దు.

**✷ పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి.**



**చింతపల్లి పెన్ పవర్ జూన్ 9.** రీ సర్వేలో లోపాలను సరి చేసే ప్రయత్నంలో అధికారులంతా రైతులకు సహకారం అందించాలని చింతపల్లి మండల ప్రజా పరిషత్తు అధ్యక్షులు కోరాబు అనూష దేవి సూచించారు. భవిష్యత్తులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రీ సర్వే చేయాలని ఆమె తెలిపారు. చింతపల్లి మండలం కిటిముల పంచాయతీ రాజు పనుకుల గ్రామంలో మంగళవారం పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరిగిన సర్వేనే కూటమి ప్రభుత్వం జియో టాకింగ్ చేసిందని, కొత్తగా చేసింది ఏమీ లేదన్నారు. అయితే ఈ ప్రభుత్వం చేస్తున్న రీసర్వేలో సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయని ఆ విషయం రైతులు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. రైతులు లేని సమయంలో రీ సర్వే చేయొద్దన్నారు. ఎక్కడెక్కడ రీ సర్వే చేస్తున్నారో ముందుగానే రైతులకు సమాచారం ఇచ్చిన తర్వాత రైతులు హాజరైతేనే ఆ భూముల్లో సర్వే చేయాలన్నారు. రైతు లేకుండా సర్వే చేస్తే హద్దులు మారిపోయే ప్రమాదం ఉందని భూమి కూడా తక్కువగా నమోదుఅయ్యే అవకాశం ఉందని ఆమె అన్నారు. చాలాచోట్ల రైతులకు సమాచారం ఇవ్వకుండా రీ సర్వే చేస్తున్నారని ఇది సరికాదన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నదే తమ ఉద్దేశం అన్నారు. భవిష్యత్తులో రైతులెవరూ రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరగకూడదు అన్న ఉద్దేశంతో జగన్మోహన్ రెడ్డి భారతదేశంలోని తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ లో రిసర్వే వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఇంత గొప్ప వ్యవస్థ తీసుకొచ్చిన తర్వాత కూడా మళ్లీ అధికారులు చుట్టూ రైతులు తిరిగే పరిస్థితిని తీసుకురావద్దన్నారు. రీ సర్వే దగ్గర నుంచి పాసు పుస్తకం ముద్ర వరకు రైతులు అనుమతితో రైతుల సూచన మేరకే చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ అబ్బాయి నాయుడు,తహసిల్దార్ త్రివేణి, డీటీ, వీఆర్వో రీ సర్వ్ సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని మాధురికి అండగా నిలిచిన చిన్న శ్రీను



**బిమిలి, పెన్ పవర్, జూన్ 09:**///భీమిలి నియోజకవర్గం పద్మనాభం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దివం గత కంటుబొతు శ్రీను ప్రమాదవశాత్తు మృతి చెందడంతో వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో కుటుంబ పరిస్థితిని గుర్తించిన విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షు డు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను మానవతా దృక్పథం తో ముందుకు వచ్చి, ఆయన కుమార్తె కంటు బొతు మాధురి విద్యాభ్యాసానికి చేయూతని చ్చారు.మాధురిని బోయపాలెంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య కోసం చేర్పించడమే కాకుండా, ఆమె చదువుకు అవ సరమైన రూ.1.10 లక్షల ఫీజును స్వయంగా చెల్లించి కుటుంబానికి అండగా నిలిచారు.
ఈ సందర్భంగా మాధురి, ఆమె తల్లి చిన్న శ్రీను ని, ఆయన కుమార్తె మజ్జి సిరి సహస్ర సిరమ్మను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవి ష్యత్తు కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని, మాధురి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు చిన్న శ్రీను తెలిపారు.
ఈ కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కంటు బొతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పద్మనాభం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత తీర్థయాత్ర సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన...

**బిజెపి సీనియర్ నాయకులు పేరూరి బుల్లి దొర....**

**నాతవరం,పెన్ పవర్ (జూన్ 09):** మండల కేంద్రమైన నాతవరంలో బీజేపీ సీనియర్ నాయకులు పేరూరి రాయుడు (బుల్లిదొర) ఆధ్వర్యంలో ముత్యాల వెంకటేశ్వరరావు (ఎమ్ వి ఆర్) నిర్వహిస్తున్న ఉచిత తీర్థయాత్ర సేవా కార్యక్రమంపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బుల్లిదొర మాట్లాడుతూ అన్నవరం, సింహాచలం, రుషికొండ శ్రీ వెంకటేశ్వరస్వామి వారి పుణ్యక్షేత్రాలకు భక్తులను ఉచితంగా తరలిస్తూ,ప్రతి ఒక్కరికీ దైవ దర్శనం కల్పించాలనే సంకల్పంతో ముత్యాల వెంకటేశ్వరరావు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని అన్నారు.అలాగే ఎమ్.వి.ఆర్ చేపడుతున్న వివిధ సామాజిక, సేవా కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపూరి వాసు, సత్తి మణికంఠ రెడ్డి ,పాయకరావుపేట,నర్సీపట్నం ఇన్‌చార్జ్



గంట సూరిబాబు, మాకవరపాలెం మండల అధ్యక్షులు మగ్రి నాయుడు,రత్నమాల, నేతల బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

## యువతను వ్యసనాల నుంచి దూరం చేయడమే లక్ష్యంగా నాతవరం ప్రీమియర్ లీగ్ ప్రారంభం...



**స్థానిక ఎస్సై వై.తారకేశ్వరరావు....**

**నాతవరం, పెన్ పవర్ (జూన్ 09):** యువతను మాదకద్రవ్యాలు, మద్యం, ఆన్‌లైన్ గేమింగ్ వంటి వ్యసనాల బారిన పడకుండా కాపాడి క్రీడల వైపు మళ్లించాలనే లక్ష్యంతో నాతవరం ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 100 డేస్ యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌లో భాగంగా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల కింద నాతవరం ఎస్సై వై. తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ, జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, ఎంపీడీవో ఎం.ఎస్. శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ అప్పిరెడ్డి మాణిక్యం, పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొని టోర్నమెంట్ కప్‌ను ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు.అనంతరం జరిగిన సభలో అతిథులు మాట్లాడుతూ యువత ముఖ్యంగా గంజాయి, మాదకద్రవ్యాలు, మద్యపానం, ఆన్‌లైన్ గేమింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండేందుకు ఇటువంటి క్రీడా పోటీలు దోహదపడతాయని అన్నారు. గ్రామాలను గంజాయి రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఎస్సై వై. తారకేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు ఆహ్వానాలు పంపి, ప్రతి గ్రామం నుంచి ఒక జట్టు చొప్పున పాల్గొనేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. యువత అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల వినియోగం, మద్యపానం, ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.గ్రామాల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడం, యువతను సానుకూల దిశగా ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని అలవర్చడం ఈ టోర్నమెంట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.10,000 నగదు బహుమతి, ద్వితీయ స్థానానికి రూ.5,000, తృతీయ స్థానానికి రూ.3,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సింగంపల్లి సన్యాసిదేముడు, అంకంరెడ్డి నానిబాబు, గవిరెడ్డి నాగన్నదొర, పిన్నిరెడ్డి జోగారావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన చాలా బాధాకరం...!

**✷ మాజీ జిసిసి చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్ దిగ్భ్రాంతి**



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 9 :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన విషాదకర దుర్ఘటనలో విధి నిర్వహణలో ఉన్న కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటన అత్యంత బాధాకరమైనది మాజీ జిసిసి చైర్మన్ ఎం.వి.వి ప్రసాద్ అన్నారు .
ఈ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అని, వారి కుటుంబాలకు ఈ కష్టకాలంలో మనోధైర్యం కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను అని అన్నారు.
అలాగే, గాయపడిన కార్మికులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణజీవితంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను.బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయి అన్నారు.
ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

## నేడే బాలారంలో గిడ్డి ఈశ్వరి పర్యటన...!



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 9 :** బుధవారం పాడేరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మండలంలోని బాలరం గ్రామంలో పర్యటించనున్నారని టిడిపి మండల అధ్యక్షులు కాకురి చంద్రావు, మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు లు తెలిపారు. ఉదయం 9:20 గంటలకు గ్రామంలో రూ. 50 లక్షల నిధులతో మంజూరు అయిన చెరువు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేయనున్నట్లు వారు తెలిపారు. శంకుస్థాపన అనంతరం ప్రతినెల రెండో బుధవారం నిర్వహించే మండల స్థాయి పార్టీ సమావేశం బాలరం పంచాయతీలో కొయ్యూరు మండల అధ్యక్షుడు కాకూరి చంద్రావు ఆధ్వర్యంలో జరగనుంది అన్నారు. కావున మార్కెట్ కమిటీ డైరెక్టర్, కోపరేటివ్ చైర్మన్, డైరెక్టర్లు, క్లస్టర్ ఇన్చార్జిలు, బూత్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జులు, మాజీ ప్రజా ప్రతినిధులు, టిడిపి బిజెపి జనసేన కూటమి నేతలు మహిళలు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు.

# స్టీల్ ప్లాంట్ బాధితులకు కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి

- వాసుపల్లి గణేష్ కుమార్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 09 :**విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో బాధిత కుటుం బాలకు ప్రభుత్వం తక్షణమే ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైఎస్సార్‌సీపీ సమన్వ యకర్త డిమాండ్ చేశారు.మంగళవారం కేజీహె చ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను, మృ తుల కుటుంబ సభ్యులను ఆయన పరామ ర్శించారు. మాజీ ముఖ్యమంత్రి ఆదేశాల మేర కు బాధిత కుటుంబాలకు పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ సంద ర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి పరిహారం ప్రకటించలేదని విమర్శించారు. మృతుల కు టుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు వారి పిల్లల విద్య, భవిష్యత్తుకు అవసర మైన సహకారం అందిస్తామని తెలిపారు.

తమ ప్రభుత్వ హయాంలో బాధిత కుటుంబా లకు రూ.1 కోటి చొప్పున పరిహారం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా, మరికొందరు కేజీహెచ్, సెవెన్ హిల్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఆయన, గాయపడిన బాధితులు త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల ప్రతినిధు లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ జీకే వీధి మండల మోర్చా అధ్యక్షుల నియామకం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 9**: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర, జిల్లా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు గూడెం కొత్తవీధి మండలంలోని వివిధ మోర్చాలకు అధ్యక్షులను నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కాకూరు శేఖర్ తెలిపారు. మండల ఇన్‌చార్జి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కదుల శ్రీనివాసరావు సమక్షంలో ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా లకే రాంబాబు (రాము), యువ మోర్చా మండల అధ్యక్షుడిగా భౌడు సతీష్ దొర, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా చదరం మారిబాబును నియమించినట్లు వెల్లడించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థాగత బలోపేతానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ు

## పిల్లల జీవితంలో తొలి వెయ్యి రోజుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- నవ చేతన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం పూర్తి.
- ముంచంగిపుట్టు మండల సిడిపిఓ యు విమల కుమారి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 09.**పిల్లల్లో అభివృద్ధి అలసత్వం ముందుగానే గుర్తించి సరైన సమయంలో జోక్యం చేసుకోవాలని, ప్రతి యొక్క పిల్లవాని జీవితంలో తొలి వెయ్యి రోజుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ముంచంగిపుట్టు మండల ఐసిడిఎస్ సిడిపిఓ యు విమల కుమారి తెలిపారు. నవ చేతన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోనీ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల1లో నవ చేతన 3 రోజులు శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసిందని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో నవ చేతన యాప్ ద్వారా పిల్లల స్థూల చలనాలు, సూక్ష్మ చలనాలు, భాష నైపుణ్యాలు, జ్ఞానాత్మక సామర్థ్యాలు, సామాజిక భావోద్వేగా అభివృద్ధిని శాస్త్రీయంగా అంచన వేసే విధానాన్ని వివరించడం జరిగిందన్నారు. శిక్షణ కార్యక్రమంలో లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యాంప్రసాద్ హాజరయ్యి ఎన్సిపి కార్డు, గ్రోత్ చార్ట్ గురించి అంగన్వాడీ కార్యకర్తలకు క్లుప్తంగా వివరించినట్లు ఆమె వెల్లడించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తిచేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి: అంబర్ సింగ్




**గాజువాక పెన్ పవర్, జూన్ 09:**మానవ అక్రమ రవాణ నిర్మూలించడం మన అందరి బాధ్యత ఈశ్వరి ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ట్రైనింగ్ కోఆర్డినేటర్ అంబర్ సింగ్ అన్నారు.

మనుషుల అక్రమ రవాణా నిర్మూలన లో ప్రజలు అందరు భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చు అన్నారు .

ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ మరియు స్వర్ణ గ్రామము మరియు స్వర్ణ వార్డు ఎమ్ ఎస్ కె విశాఖ జిల్లా నందు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని

సూపరింటెడేట్ ఈశ్వరి పరిశీలించారు. . శిక్షణ ను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య. దీనికి పేద మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువ గా గురి అవుతున్నారు. సమాజంలో ప్రజలతో మరియు విద్యార్థులతో సన్నిహితంగా ఉండి గమనించి వారికి అవగాహనా కల్పించాలి, ముఖ్యంగా పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్ లో వారికి అవగాహనా కల్పించాలి. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జటిలమైన సమస్య పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలి అని అన్నారు. సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఆర్థిక కారణలా తో పాటు, సామజిక కారణాలు దోహదం చేస్తాయి, మన చుట్టుపక్కల ఉండే ఇలాంటి వాళ్ళను ట్రాఫికెర్స్ టార్గెట్ చేసి, మాయమాటలు, ఉద్యోగం సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాలలో అమ్ముతున్నారు, కాబట్టి డిపార్ట్మెంట్ జిల్లా నుండి గ్రామ స్థాయి వరకు అందరు అవగాహనా కలిగి ఉండి, అప్రమతం చేయడం ద్వారా దీన్ని నిర్మూలించవచ్చు. చట్టాల పైన అవగాహన పెంచుకోవాలి అని అన్నారు.ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ అంబర్ సింగ్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించు కోవచ్చు, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు దీని బారిన పడుతున్నారు. ముక్యంగా యువత, పిల్లలు ఆకర్షణకు గురి అయి, పట్టణాలకు వచ్చి వ్యభిచార గృహాలలో అమ్మబడుతున్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 33 వేల మంది అమ్మాయిలను మహిళలను కాపాడడం జరిగింది. ఇందులో చిన్న పిల్లలు, యువతులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. సైబర్ ట్రాఫికింగ్ ద్వారా ఈ అక్రమ రవాణా చాలా పెరిగి పోయింది, ముఖ్యంగా విద్యార్థులు అనవసరం అయినా అప్స్ ద్వారా పర్సనల్ ఫొటోస్ వీడియోస్ పంపడం ద్వారా సెక్స్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారు. మీరు జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఉన్న మన సిబ్బంది ఈ విషయాలపై అవగాహనా పొంది ఇతరులకు అవగాహనా కల్పించాలని సూచించారు.

శిక్షణలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, బాధితురాలి పైన ఉండే ప్రభావాలు, సైబర్ అదారిత అక్రమ రవాణా,

చట్టాలుబిఎన్ఎస్,ఒటిపిఎ,పిఓఎస్ఓ,పిసిఎమ్ఎ సఖి, భరోసా, చైల్డ్ లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్స్ 1098, 100, 181, 1930, 181తెలియజేయాలన్నారు.

బాలబాలికల పై జరుగుతున్న లైంగిక నేరాల , పిల్లలతోని ఎలా ఉండాలి మరియు ఎలా రక్షించాలి అనే అంశం పై చర్చించారు.

ట్రైనింగ్ వచ్చినటువంటి ఎమ్ఎస్ కె బాధ్యత గా విలేజ్ కి వెళ్ళిన డ్వాక్రా సభ్యులకు, ప్రజలకు అంశాల పైన ఆహాగాహన కల్పించాలని, విద్యార్థులకు అవగాహన కల్పించాలి మరియు స్టూడెంట్ విజిలంట్ గ్రూప్ క్రియాట్ చెయ్యాలి ప్రతి తరగతి నుండి బాలురు నుండి ఇద్దరిని మరియు బాలిక నుండి ఇద్దరిని తీసుకోవాలి గ్రూప్ లో రిపోర్టింగ్ చేసే విధానాలు వివరించాలన్నారు.

## అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి..

**చీపురుపల్లి పెన్ పవర్ జూన్ 9:**అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలు జరుపుతున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి సెక్టార్ పరిధిలోని సూపర్వైజర్ పి శశికళ పలువురుకు పిలుపునిచ్చారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో వంగపల్లి గ్రామంలో అంగన్వాడీ బడి పిలుస్తుంది కార్యక్రమంలో గ్రామంలో మంగళవారం నాడు ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అమలు జరుపుతున్న అభివృద్ధి పథకాలతో పాటు విద్య శారీరక భాష సంస్కృతి తదితర అంశాల పట్ల పిల్లలకు మెరుగైన సేవలు అందజేయడం జరుగుతుందని ఆమె వివరించారు. ప్రత్యేకించి కేంద్రాల ద్వారా పంపిణీ జరుగుతున్న పౌష్టికాహారాన్ని అర్హత గల ప్రతి ఒక్కరు అందుకుని సంపూర్ణ ఆరోగ్య వంతులు కావాలని



ఆమె కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో అంగన్వాడీ బడి పిలుస్తుంది అనే నినాదాలు జరిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పి శశికళ తో పాటు అంగన్వాడి కేంద్రం టీచర్లు జె ,రాము . ఆర్ భారతి. ఆయాలు, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతలకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ



- మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ.
- ముంచంగిపుట్టు మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య.
- మండల వ్యవసాయ శాఖ అధికారి గిరడ మురళీకృష్ణ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 09.**ముంచంగిపుట్టు మండల కేంద్రంలో రాబోయే వానాకాలం యాసంగి సాగును దృష్టిలో ఉంచుకుని, రాయితీపై స్థానిక రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సన్యాసమ్మ సంధ్య మాట్లాడుతూ.. “రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతోనే ఈ విత్తనలను ప్రభుత్వం సకాలంలో పంపిణీ చేస్తోందన్నారు. రైతే దేశానికి వెన్నుముక అని, రైతులకు ఎల్లప్పుడూ ప్రభుత్వం అండగా ఉంటుందని, నాణ్యమైన విత్తనాలు అందించి, మంచి దిగుబడులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆమే అన్నారు. ఈ నేపద్యంలో సకాలంలో విత్తనాలు అందించడంపై రైతులు హర్షం వ్యక్తం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. 90 శాతం రాయితీపై సన్న చిన్న కారు రైతులకు ధాన్యం పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొంతేరి జగన్రాయ్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రాణాసింగి నిలకంఠం పాత్రో, క్లస్టర్ ఇంచార్జ్ లు మజ్జి చిన్ని, బి రామారావు, సిపిఎం నేత శ్రీను, నాయకులు నవీన్ కుమార్, సింహాచలం, అక్షయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.


## ఘనంగా బిర్సా ముండా వర్ధంతి.

**చింతపల్లి పెన్ పవర్ జూన్ 9.**దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన హక్కుల పోరాట యోధుడు భగవాన్ బిర్సా ముండా వర్ధంతిని చింతపల్లి మేజర్ పంచాయతీ గ్రామ సచివాలయం-1లో పంచాయతీ కార్యదర్శి ముక్కలి వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మాతృభూమి స్వేచ్ఛ కోసం, గిరిజనుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను, ప్రాణత్యాగాన్ని ఈ సందర్భంగా వారు కొనియాడారు. యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా అంబేద్కర్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## డెత్ సర్టిఫికెట్ తమకే ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు వినతి



అర్జీ రశీదు

PGRS - Collectorate
Monday
Visakhapatnam

| | | | |
|---|---|---|---|
| Grievance No | VSP20260608953 | అర్జీ నమోదు తేది | 08-06-2026 |
| అర్జీ విభాగము | Revenue (Ccla)-->Gsws/Meeseva Grievances (Revenue)->Non Issuance / Delay In Certificates Beyond Sla (Revenue) | | |
| పేరు | DEVARAPILLI YERNIPYDIRAJU | ఫోను | 9618783736 |
| జిల్లా | Visakhapatnam | మండలము | Padmanabham |
| సచివాలయము | KOVVADA-(R), 10390262 | ప్రస్తుత నివాసం | 1-23, 1-23, KOVVA (R), 10390262, Padmanabham, Visakhapatnam |
| పరిష్కరించు అధికారి | Tahsildar, Padmanabham | | |
| గడువు | 52 Day(s) | పరిష్కరించు గడువు తేది | 30-07-2026 |
| ఎన్రోల్మెంట్ ఆపరేటర్ | ఆపరేటర్-5, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, విశాఖపట్నం | | |

గమనిక! మీ యొక్క ఫిర్యాదు స్థితి కొరకు 1100 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోను చేసి Grievance No చెప్పగలరు.

1 of 1

**పద్మనాభం, పెన్ పవర్ జూన్ 09** :పద్మనాభం మండలం పెంట గ్రామానికి చెందిన దేవరాపల్లి ఏర్నీ పైడిరాజు సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదులో ఆయన తెలిపిన వివరాల ప్రకారం, తన తండ్రి దేవరాపల్లి రాములకు ఇద్దరు భార్యలు ఉన్నారని, మొదటి భార్య దేవరాపల్లి కన్నమ్మకు ఇద్దరు సంతానం ఉం డగా, రెండో భార్య దేవరాపల్లి దేవుడమ్మకు సంతానం లేదని పేర్కొన్నారు. అయితే దేవుడ మ్మ మొదటి భార్య పిల్లలను తన సొంత పిల్లలుగా భావించి ప్రేమగా చూసుకున్నారని తెలిపారు.దేవరాపల్లి దేవుడమ్మ మార్చి 3 2020 మరణించారని, ఆమె డెత్ సర్టిఫికెట్ తమకే జారీ చేయాలని కోరారు. కొందరు వ్యక్తులు తమ చిన్నాన్న కుమారుడిని దేవుడ మ్మ పెంచుకున్నారని ఆరోపిస్తూ, డెత్ సర్టిఫికెట్‌ను ఇతరులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పైడిరాజు పేర్కొన్నారు.

ఇది పూర్తిగా తమ కుటుంబానికి సంబంధించిన వ్యవహారమని, మూడో వ్యక్తులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. దేవరాపల్లి దేవుడ మ్మ డెత్ సర్టిఫికెట్‌ను తమకే అందజే యాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు.

## తీరనున్న త్రాగునీటి కష్టాలు

- క్రొత్త బోర్ వెల్ పనులకు శంకుస్థాపన చేసిన
- 12 వ వార్డు టిడిపి అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు



**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూన్ 9:** 12 వ వార్డు చిన్నగదిలి రాధాకృష్ణ నగర్ కొండవాలు ప్రాంత ప్రజల నీటి కష్టాలు క్రొత్త బోర్ వెల్ పనులు ప్రారంభించడంతో తీరనున్నాయి. వేసవి కాలంలో ప్రజల నీటి అవసరాలు అనుగుణంగా త్రాగునీరు సరఫరా లేకపోవడం,ఉన్న బోరింగ్ అడుగంటి పోవడంతో సరిపడా నీరు లేక ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యపై స్థానికులు 12 వ వార్డు టిడిపి అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజుకు తెలియపరచగా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ప్రజల త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు నూతన బోర్వెల్ మంజూరు చేయడం వెంటనే పనులు ప్రారంభించి ప్రజలు అవసరాలు మేరకు మంగళవారం బోర్ వెల్ పనులను వార్డు అధ్యక్షుడు ప్రారంభించి ప్రజల నీటి అవసరాలు తీర్చారు. అడిగిన వెంటనే బోర్వెల్ మంజూరు చేసి పనులు ప్రారంభించి నీటి అవసరాలు తీర్చనున్న నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి కి ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

కార్యక్రమం లోవార్డు ప్రధాన కార్యదర్శి పోతిన భరత్ ఆర్గనైసింగ్ సెక్రటరీ పోలారవు యువత అధ్యక్షులు సీరియల కృష్ణ,ఆనంద్,ఒమ్మి కుమారి, నమ్మి గణేష్,తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ. సీఐ లక్ష్మణరావు



**జి.మాడుగుల పెన్ పవర్.జూన్ (9)** మహిళల భద్రత, గంజాయి సాగు, వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జి.మాడుగుల సీఐ లక్ష్మణరావు సూచించారు. సంతబయలు సంతలో సీఐ లక్ష్మణరావు, ఎస్సై.సాయిరాం పడాల్ ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మహిళలపై జరిగే నేరాల నివారణ, మహిళల రక్షణపై అవగాహన కల్పించారు.

అలాగే గంజాయి సాగు, వినియోగం వల్ల యువత భవిష్యత్తుపై పడే ప్రభావాలను వివరించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత కాల్స్, ఆన్‌లైన్ లింకుల పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదం వెనుక కుట్ర కోణం:

## మరణించిన కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి :ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 9:**విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలో వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు, మాజీ మంత్రిలు కురసాల కన్నబాబు,గుడివాడ అమర్నాద్.పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు, ఇతర నాయకులతో కలిసి పరామర్శించిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ. ఈ సందర్భంగా కేజీహెచ్ లో మీడియాతో మాట్లాడిన ఆయన

ప్రైవేటీకరణ కుట్రలతోనే స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదాలు

కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వం సమర్థులైన అధికారుల బదిలీ వల్లనే భారీ ప్రమాదానికి కారణం అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు

ఎల్జీ పాలిమర్స్ తరహాలో కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి

నేడు (బుధవారం) విశాఖకు వైయస్ జగన్

స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు పరామర్శ

: బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు

స్టీల్ ప్లాంట్ ప్రమాదం వెనుక కుట్ర కోణం దాగుందని, సంస్థ ప్రైవేటీకరణ కుట్రలతోనే స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదాలు జరగుతున్నాయని, ఆ విధంగా కార్మికుల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఫైర్ అయ్యారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి సమర్థులైన అధికారులను బదిలీ చేయడం వల్లనే భారీ ప్రమాదం చోటు చేసుకుందన్న ఆయన, ఇకనైనా సంస్థలో ఉద్యోగుల తొలగింపు ఆపాలని తేల్చి చెప్పారు. ప్రమాదంలో దుర్మరణ చెందిన కార్మికుల కుటుంబాలకు ఎల్జీ పాలిమర్స్ తరహాలో కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ పరిహారం కోసం వైయస్సార్‌సీపీ రాజీ లేని పోరాటం చేస్తుందని చెప్పారు. స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించేందుకు బుధవారం వైయస్ జగన్ పర్యటిస్తారని, విశాఖ కేజీహెచ్ వద్ద మీడియాతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు వెల్లడించారు..

జరిగిన ప్రమాదం దురదృష్టకరంఅని,విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన భారీ ప్రమాదం అత్యంత దురదృష్టకరమని ఈ దుర్ఘటనలో ఇప్పటికే 8 మంది కార్మికులు దుర్మరణం చెందగా,సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో 90 శాతం కాలిన గాయాలతో ఉన్న మరో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. కిమ్స్ ఆసుపత్రిలో 40 శాతం గాయాలతో మరో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. వారందరూ కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం. దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు పార్టీ తరపున, అధినేత వైయస్ జగన్ ప్రగాఢ సానుభూతి తెలిపారన్నారు.

ప్రైవేటీకరణ కోసమే ప్లాంట్ నిర్వీర్యం చేస్తుందని

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తమ తాబేదార్లకు కట్టబెట్టాలనే కుట్రతోనే వ్యవహరిస్తోంది. స్టీల్ ప్లాంట్‌లో సమర్థులైన అధికారులను దొడ్డిదారిన బదిలీ చేయడం వల్లే అనుభవజ్ఞుల కొరత ఏర్పడి, ఈ తరహా భారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. మిషనరీ నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారనీ ఇప్పటికే శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులు అంతా కలిపి దాదాపు 10 వేల మందిని అన్యాయంగా తొలగించారు.ఇకనైనా బలవంతపు వీఆర్ఎస్ చర్యలను ఆపాలనీ కోటి పరిహారం. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి:

గతంలో వైయస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఎల్జీ పాలిమర్స్, ఫార్మా కంపెనీల ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తక్షణమే కోటి రూపాయల పరిహారం అందజేసి, ఆ తర్వాత కంపెనీల నుంచి రికవరీ చేశాంమని. ఇప్పుడు కూడా కార్మికుల డిమాండ్ మేరకు మృతి చెందిన ప్రతి కార్మిక కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలి. కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలి. ఈ డిమాండ్లు నెరవేరే వరకు వైయస్సార్సీపీ కార్మికుల పక్షాన ఉండి రాజీలేని పోరాటం చేస్తుందన్నారు.

మంత్రి లోకేష్ తీరు దారుణం.

:కురసాల కన్నబాబు ఆగ్రహం

బాధితులను పరామర్శించడానికి వచ్చిన మంత్రి నారా లోకేష్.. సమస్యలపై ప్రశ్నించిన కార్మిక సంఘాల నేతలపై ఆగ్రహం వ్యక్తం చేయడం, రాజకీయం చేయడం దారుణం. నాడు ఎల్జీ పాలిమర్స్ ఘటన జరిగినప్పుడు వైయస్సార్సీపీ ప్రభుత్వంలో ఉన్న మేమంతా, సీఎస్‌తో సహా ఇక్కడే ఉండి బాధితులకు అండగా నిలబడ్డాం. కానీ నేడు అధికారంలో ఉన్నవారు కనీస ఓపిక, సహనం లేకుండా కార్మిక నేతలపై నోరు పారేసుకోవడం శోచనీయం.

బుధవారం విశాఖకు శ్వైయస్ జగన్:స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను ఓదార్చడానికి, వారికి అండగా నిలబడడానికి వైయస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, అనంతరం ప్లాంట్ యూనియన్ నేతలతో మాట్లాడతారని మాజీ మంత్రి కురసాల కన్నబాబు వివరించారు.

కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, జిల్లా పార్టీ కార్యాలయం పర్యవేక్షులు రవి రెడ్డి, పార్టీ నాయకులు కట్టుమూరి సతీష్ ,మంత్రి రాజశేఖర్, పీవీ సురేష్ రెయ్యి వెంకటరమణ,జీలకర్ర నాగేంద్ర, అంబటి శైలేష్, గోడాబా మనోజ్, రాయపురెడ్డి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# యోగతో ఆరోగ్యవంతమైన సమాజం





- మారేడుమిల్లి అరణ్య ప్రాంతంలో యోగాంధ్రకు విశేష స్పందన
- జూన్ 21న రంపచోడవరంలో భారీగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- కలెక్టర్ దినేష్ కుమార్

**గంగవరం/ మారేడుమిల్లి, పెన్ పవర్, జూన్ 9:**ప్రతి వ్యక్తి ప్రతిరోజూ కనీసం 45 నిమిషాలు యోగా సాధన చేస్తే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పేర్కొన్నారు. యోగాంధ్ర--2026 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మారేడుమిల్లి సమీపంలోని వుడ్స్ రిసార్ట్స్ ప్రాంగణంలో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్. బొజ్జిరెడ్డి, రంపచోడవరం ఎమ్మెల్యే, లెజిస్లేటివ్ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీష దేవి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత తదితరులతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ యోగా భారతదేశానికి చెందిన అమూల్యమైన వారసత్వ సంపద అని, దాని విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పే క్రమంలో 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితిలో తీసుకున్న చొరవతో జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రపంచ దేశాలు జరుపు కుంటున్నాయని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు యోగా ప్రయోజనాలను ప్రతి ఇంటికీ చేరవేసేందుకు 14 రోజులపాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒత్తిడితో కూడిన ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని మారేడుమిల్లి వంటి ప్రకృతి అందాల మధ్య నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు. గుడిసె, మారేడుమిల్లి, పరిసర ప్రాంతాల్లోని పర్యాటక కేంద్రములను యోగాంధ్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జిల్లాలో ప్రతి పౌరుడికి కామన్ యోగా ప్రోటోకాల్‌పై శిక్షణ అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.జూన్ 17న చింతూరు మండలం మోతుగూడెంలో, జూన్ 21న రంపచోడవరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్. బొజ్జిరెడ్డి మాట్లాడుతూ మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో యోగాంధ్ర నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. యోగా వల్ల ఆరోగ్య ప్రయోజనాలు అపారమని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి నాయకులు కూడా నిత్య యోగా ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కూడా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు. యోగా చేయడం వల్ల కుటుంబాలు ఆరోగ్యవంతంగా మారడంతో పాటు సమాజం కూడా ఆరోగ్యకరంగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. పోలవరం జిల్లాలో ప్రతి వ్యక్తికి యోగా పట్ల అవగాహన కల్పించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు.అనంతరం యోగా గురువులు కథల నారాయణరెడ్డి, కథల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వివిధ యోగాసనాలను ప్రదర్శించి పాల్గొన్న వారితో సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఆర్డీవో కె. స్వాతి, ఎస్డీపీఓ అష్రఫ్ అలీ, రాష్ట్ర మైనార్టీ కమిటీ సభ్యుడు షేక్ సుభాని, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఏలూరులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు





- ప్రధాన డ్రైన్‌లలో వ్యర్థాల తొలగింపు
- పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే బడేటి చంటి

**ఏలూరు జూన్ 9 పెన్ పవర్ :**రానున్న వర్షాకాలంలో నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేసినట్లు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. నగరాన్ని స్వచ్ఛ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రధాన డ్రైన్‌లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాల తొలగింపు పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మంగళవారం 45వ డివిజన్‌లోని జాలిపూడి డ్రైన్‌తో పాటు 7వ డివిజన్ తూర్పువీధి గంగానమ్మ గుడి సమీపంలోని డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు.అనంతరం కార్పొరేషన్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.గత 20 రోజులుగా ప్రధాన కాలువలు, డ్రైన్‌లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేశామని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, దోమల సమస్యలు, పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

### ప్రజల సహకారం అవసరం

డ్రైన్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాలు,చెత్తాచెదారం వేయడం వల్లే దుర్వాసనలు, పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇంటింటికీ వచ్చే చెత్త సేకరణ సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని, నగర పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


నగర ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల సమన్వయంతో చర్యలు కొనసాగుతున్నాయని, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఏలూరు నిర్మాణమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కార్పొరేటర్లు పారిశుద్ధ్యవిభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగుదేశంపార్టీ బృందంసుడిగాలి పర్యటన



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూన్.9:**మండలంలోని బూరుగువాడ,బొడ్డుగుంపు,రామాపురం గ్రామాల్లో,నివసిస్తున్న,ప్రజలుసమస్యలు,తెలుసుకొనేందుకుమంగళవారం తెలుగుదేశంపార్టీ బృందం సుడిగాలి పర్యటన చేశారు.తెలుగుదేశంపార్టీ బృందం గిరిజనుల, సమస్యలను,రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే, మిరియాల శిరీషదేవి,కుచారవాణి ద్వారా తెలియజేశారు. మారుమూలగ్రామాల్లోపర్యటన చేసినతెలుగుదేశంపార్టీ బృందానికి,ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.ఆ గ్రామాల్లో అభివృద్ధి,కార్యక్రమాలపై దృష్టి పెడతామని,మెరుగైన సౌకర్యాల కల్పనకై మాట్లాడతానని,ఎమ్మెల్యే,హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు మాట్లాడుతూ మాది మంచి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు తోడుగాఉండేది,తెలుగుదేశంపార్టీ,అంటూ కొనియాడారు.కౌంటర్లు ఇవ్వడం మాపనికాదు,అభివృద్ధి చేసి చూపించడమే మాదేయం,అంటూ స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాయం రామా రావు,యూనిట్ ఇంచార్జ్,బీరక సూర్య ప్రకాష్,రావు,బింగి విష్ణుమూర్తి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ ఖాతాలో మరో చారిత్రాత్మక రికార్డు



- సుదీర్ఘ కాలం ప్రధానిగా కొనసాగిన ఘనత
- శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకుడు కోన సత్యనారాయణ

**మండపేట. పెన్ పవర్. జూన్ 9:**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరనుందని బీజేపీ సీనియర్ నాయకుడు కోన సత్యనారాయణ తెలిపారు. జూన్ 10, 2026 నాటికి మోదీ వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా కొనసాగి, స్వాతంత్ర్యానంతర భారతదేశంలో సుదీర్ఘకాలం నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానిగా రికార్డు సృష్టించనున్నారని పేర్కొన్నారు. మోదీ 2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రి బాధ్యతలు స్వీకరించి, వరుసగా మూడు పర్యాయాలు దేశానికి నాయకత్వం వహిస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటి వరకు ఈ రికార్డు భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరిట ఉండగా, జూన్ 10తో మోదీ ఆ రికార్డును అధిగమించ నున్నారని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా కలిపి ఎన్నికైన ప్రభుత్వాధినేతగా అత్యంత కాలం సేవలందించిన నాయకుడిగా కూడా మోదీ ఇప్పటికే రికార్డు నెలకొల్పారని కోన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీకి ఆయన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# కాలుష్య రహిత పుష్కరాలకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలి

- కేంద్ర పథకాల్లోని నిధులనే వేగంగా మంజూరు చేయాలి
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు విజ్ఞప్తి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్జూన్ 9:**గోదావరి నదిని కాలుష్య రహితంగా మార్చేందుకు, భక్తులు పరిశుభ్రమైన పుష్కర స్నానాలు ఆచరించేందుకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే నిధులు విడుదల చేసి సహకరించాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు విజ్ఞప్తి చేశారు. స్థానిక బిజెపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇటీవల గోదావరి కాలుష్యంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిశిత పరిశీలన, సమీక్ష అనంతరం సంబంధిత ప్రభుత్వ శాఖల్లో కదలిక రావడం అభినందనీయమన్నారు. ఈ క్రమంలోనే పేపర్ మిల్లుకు, కార్పొరేషన్ కు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. గోదావరి నది కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నివారించేందుకు రూ .1600 కోట్ల రూపాయలతో సమగ్ర ప్రణాళిక
సిద్ధమైందన్నారు. మొదటి దశలో నదీ కాలుష్య నివారణకు రూ. 416 కోట్లు నిధులు మంజూరు కాగా, తొలి విడతగా రూ .95 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని వాటితో ఆవ ప్రాంతంలో ఎస్ టి పి ప్లాంట్ నిర్మాణం జరుగుతుందన్నారు. మిగతా రూ.320 కోట్ల రూపాయలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే విడుదల చేయాలని కాలుష్య రహిత పుష్కర పనులు ప్రారంభం కావలసిందన్నారు. గోదావరి నది పరివాహక జిల్లాల్లోని 294 గ్రామాల్లోనూ కాలుష్య రహిత పనులు చేపట్టాల్సిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన సాస్కి లో రాష్ట్రానికి రావలసిన 2000 కోట్లను, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ 10,000 కోట్ల రూపాయలను, పూర్వో దయ పథకంలో రావలసిన రూ. 13,000 కోట్ల నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కేంద్రం నుంచి రాబట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేయాలన్నారు. పవన్ కళ్యాణ్ తన మంత్రిత్వ శాఖ నుంచి గోదావరి నది కాలుష్య నివారణకు రూ .100 కోట్ల రూపాయలు కేటాయించడం అభినందనీయమన్నారు.

**ఆహార సలహా మండలి కమిటీలు ఏర్పాటు...**

స్వచ్ఛమైన ఆహార పదార్థాలను విక్రయించడంలో, ఆహార ఉత్పత్తుల సక్రమ రవాణా అమ్మకాలు, పర్యవేక్షణ కోసం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో గ్రామ ,మండల జిల్లా ఆహార సలహా మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు.

**కేంద్రంలో ఎక్కువ కాలం ఎన్నికైన ప్రధానిగా మోడీ...**

కేంద్రంలో ఎన్నికైన ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు పాటు కొనసాగిన ప్రధానిగా మోడీ ఖ్యాతి సాధించారన్నారు. ఈ సందర్భంగా ఈనెల 11వ తేదీ నుంచి 18 వరకు మండల, జిల్లా స్థాయిలో బిజెపి క్యాడర్ ప్రజలతో మమేకమై ఆలయాల్లో పూజలు చేయడం, మొక్కలు నాటడం, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల పైన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అవగాహన కార్యక్రమలు చేపడతామన్నారు. బీజేపీ నాయకులు పిక్కి నాగేంద్ర, ఎనుమల రంగబాబు, అడబాల రామకృష్ణ, చిన్నారాయణ కాలేపు ఆదినారాయణ బాల సుబ్రహ్మణ్య సింగ్ తదితరులు పాల్గొన్నారు

# రెవిన్యూ సేవలలో నిర్లిప్తత ప్రదర్శించే అధికారులపై చర్యలు






- భూపరిపాలన శాఖ కమీషనర్ జయలక్ష్మి

**ఏలూరు, జూన్,9 పెన్ పవర్:** రెవిన్యూ సేవలు ప్రజలకు అందించే విషయంలో నిర్లిప్తత ప్రదర్శించే అధికారులపై చర్యలు తీసుకుంటానని రాష్ట్ర భూ పరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి అధికారులను హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, పిజిఆర్ఎస్ , 22 ఏ కేసుల పరిష్కారం, తదితర రెవిన్యూ అంశాల అమలు తీరుపై జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వితో కలిసి సిసిఎల్ఏ జయలక్ష్మి సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రజల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని,
జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేస్తా.పనితీరు మెరుగుపరచుకొని అధికారులను రివర్షన్ చేస్తానని హెచ్చరించారు. భూ రికార్డులు స్వచ్చీకరణ రీ సర్వే ప్రధాన ఉద్దేశ్యమని, రీ సర్వే లో ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించి ఎటువంటి పొరపాట్లు లేని భూ రికార్డులు రూపొందించాలన్నారు. ప్రజల 22ఏ భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. జిల్లా పరిపాలనలో రెవిన్యూ శాఖది ప్రత్యేక స్థానమని, గ్రామ స్థాయి వరకు ప్రజలతో సుపరిచయమైన శాఖని, అటువంటి రెవిన్యూ శాఖ పనితీరుపై ప్రజలలో సానుకూల దృక్పథం పెంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ సిబ్బంది ప్రజలకు అందించే సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్ సర్వే ద్వారా తెలుసుకుంటున్నదని, రెవిన్యూ సేవలలో ప్రజల సంతృప్తి స్థాయి కనీసం 80 శాతంగా ఉండాలని, ఈ సర్వే లో ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యంతో చివరి స్థానంలో నిలిచిన అధికారులు, సిబ్బంది చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఏలూరు జిల్లాలో రెవిన్యూ సేవలలో ఐవిఆర్ఎస్ సర్వే లో ఏప్రిల్ నెల కన్నా, మే నెలలో ప్రజల సంతృప్తి స్థాయి తక్కువగా నమోదైందని, తహసీల్దార్లు ఆఫీస్ లో కూర్చుని విధులు నిర్వర్తించడం కాదు. క్షేత్రస్థాయిలోకి వెళ్ళాలి.. ప్రజల సమస్యలపై అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వారితో మర్యాదగా ప్రవర్తించి, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జయలక్ష్మి తహసీల్దార్లను ఆదేశించారు. అధికారులు ప్రజలతో మమేకం అయితేనే అధికారులపట్ల సానుకూల దృక్పథం పెంపొందించుకుంటారన్నారు. రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు రెవిన్యూ సేవలందించడంలో వెనుకబడిఉన్న అధికారులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. ఏలూరు జిల్లాలో తాను ఆకస్మికంగా తనిఖీలు చేస్తానని, విధులపట్ల ప్రతిభ కనపరచిన వారిని ప్రోత్సహిస్తానని, అదే సమయంలో ప్రజలకు మెరుగైన సేవలందించడంలో విఫలమై పనితీరు మెరుగుపరచుకొని తహసీల్దార్లను రివర్షన్ ఇస్తానని జయలక్ష్మి హెచ్చరించారు. జిల్లాలో ప్రతీ నెల ఒక మండలంలో ఒక గ్రామంలో రీ సర్వే అనంతరం సవరించిన పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే కు సంబంధిత రైతులకు నోటీసులు అందించి, రైతు సమక్షంలో రీ సర్వే చేపట్టాలన్నారు. రీ సర్వే పై అందిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**కలెక్టర్ పనితీరు భేష్:** జయలక్ష్మి గతంలో నిబంధనలకు విరుద్ధంగా వివాదాస్పద భూములను 22ఏ జాబితాలో నమోదు చేసిన భూములను 22ఏ జాబితా నుండి తొలగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా జిల్లాలో ఇటీవల రెండుసార్లు మెగా 22ఏ పరిష్కార మేళాను నిర్వహించి వందలాది ఎకరాలను నిషేదిత భూముల జాబితా నుండి తొలగించారని, అంతే కాక కైకలూరు నియోజకవర్గంలో 300 మందికి పైగా రైతులకు సంబందించిన 700 ఎకరాలకు పైగా భూములను నిషేదిత భూముల జాబితా నుండి తొలగించేందుకు కృషిచేసిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని సిసిఎల్ఏ జయలక్ష్మి ఈ సందర్భంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో రెవిన్యూ అధికారులు పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి భూసమస్యలు, రెవిన్యూ, తదితర సమస్యలపై అందిన అర్జీలు నిర్ణీత సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.
జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో జిల్లాలో ఇటీవల రెండుసార్లు మెగా 22ఏ పరిష్కార మేళాను నిర్వహించి వెయ్యి ఎకరాలకు పైగా భూములను నిషేదిత భూముల జాబితా నుండి తొలగించామన్నారు. జిల్లాలో పట్టాదార్ పాస్ పుస్తకాలను నూరు శాతం పంపిణీ చేశామన్నారు.
రీసర్వే పనులను నిర్దేశించిన లక్ష్యాల మేర పూర్తిచేస్తున్నామన్నారు.
సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓలు లక్ష్మి ప్రసన్న, రమణ,సర్వే శాఖ డిడి అన్సారీ, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు తక్షణ వైద్య పరీక్షలు, ఉచిత మందులు అందించాలి

**సీతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 9 :**పోలవరం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, ఆయా వ్యాధులకు అవసరమైన ఉచిత మందులు అందజేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు.
మంగళవారం రంపచోడవరం మండలం సీతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రక్త పరీక్ష కేంద్రం, ఔషధ పంపిణీ కేంద్రం, వార్డులు, ఆసుపత్రి ప్రాంగణం తదితర విభాగాలను పరిశీలించి సేవల తీరును సమీక్షించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య పరీక్షలు అందించడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు తక్షణమే రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స, మందులు అందించాలని ఆదేశించారు. మలేరియా వ్యాప్తి నివారణకు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది వివరాలు, ప్రతిరోజూ వచ్చే రోగుల సంఖ్యపై ఆరా తీశారు. సంబంధిత రికార్డులను పరిశీలించి సేవలపై సూచనలు చేశారు.గర్భిణీ స్త్రీల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి, నెలలు నిండిన గర్భిణీలకు సురక్షిత ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రక్తహీనత నివారణకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ తనిఖీలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. సరిత, వైద్యాధికారి డాక్టర్ కెవిన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఎరువుల ధరలు తగ్గించాలని నిరసన




**ఎటపాక పెన్ పవర్, జూన్9 :**పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని , యూరియా పై నియంత్రణ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ , ఏ ఐ కే ఎస్ ఆధ్వర్యంలో ఎటపాక మండలం జిన్నగట్టు గ్రామంలో మంగళ వారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కందుకూరి స్వర్ణ (శైలజ) మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు అధికమై సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు. అలాగే ఎరువుల ధరలు పెరగడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులు, కూలీలు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.
ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు, మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు సీపీఐ సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ, మాజీ సర్పంచ్ భద్రమ్మ, సున్నం శ్రీను, గడ్డం వెంకటేశ్వర్లు, రవి, లక్ష్మి, అన్నపూర్ణ, సింగరాజు, చిన్నక్క, వీరమ్మ, కాంతమ్మ,కార్యకర్తలు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సివిల్ ఎస్సైగా ఆంజనేయ స్వామి



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,జూన్ 9;** సివిల్ ఎస్సైగా ఉలవల ఆంజనేయస్వామి నియమింపబడ్డారు. 20 12 లో రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్గా ఎంపికై పోలీసు శాఖలో విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం విజయవాడలో డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ విడుదల చేసిన బదిలీలలో ఏలూరు రేంజ్ లో సివిల్ ఎస్సైగా ఉత్తర్వులు అందుకున్నారు. జీలుగుమిల్లి గ్రామానికి చెందిన ఉలవల ఆంజనేయస్వామికి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## వివక్షత ఉన్నంతవరకు దళితులకు రిజర్వేషన్లు ఉండాల్సిందే

- నేడు జస్టిస్ కె జి బాలకృష్ణన్ నుకలవనున్న ఆస్క్ బృందం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 9**
భారత దేశ సమాజంలో అన్ని రంగాల్లో దళితుల పట్ల వివక్షత కొనసాగుతున్నంతకాలం రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని అంబేద్కర్ సేవా కేంద్రం (ఆస్క్) ఫౌండర్ చైర్మన్ గుబ్బల రాంబాబు
స్పష్టం చేశారు. రిజర్వేషన్లు ఇంకా ఎంతకాలం అంటున్నవారికి దేశంలో కుల వ్యవస్థను రద్దు చేస్తే దళితులకు రిజర్వేషన్లు అక్కరలేదన్నారు. స్థానిక స్వర్ణాంధ్ర సేవా సంస్థ కార్యాలయంలో మీడియా సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ బుధవారం న్యూఢిల్లీలో జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ ను తమ ఆస్క్ బృందం కలుస్తుందని తెలిపారు. దేశంలో దళితుల పట్ల ఎన్ డి ఏ ప్రభుత్వం వివక్షత విధానాలను అనుసరిస్తుందని, దేశంలో ఐఐటి, ఐఏఎస్సి, మెడికల్ కాలేజీలు వంటి ఇతర ఉన్నత విద్య కోర్సుల్లో 13,500 మంది దళితులు వివక్షతను ఎదుర్కోలేక డ్రాప్ అవుట్స్ గా బయటకు వచ్చేసారని ఆవేదన చెందారు. దేశంలో దళితుల స్థితిగతులపై నియమించిన కేజీ బాలకృష్ణన్ కమిషన్ కేంద్రానికి నివేదిక ఇవ్వకముందే, సుప్రీంకోర్టు మతం మారితే దళితులకు ఎస్సీ హోదా, ప్రయోజనాలు రద్దు అవుతాయని తీర్పు ఇవ్వడం వెనుక కేంద్రం కుట్ర ఉందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో సిక్కు, బౌద్ధ , హిందూ మతాల వారికి మత స్వేచ్ఛ ఉందని, క్రైస్తవ మతంలోకి మారిన
దళితులకు లేదనడం వివక్షత ఉందన్నారు. 2022 లో రంగనాథ మిశ్రా కమిషన్ దళితులకు రిజర్వేషన్లు ఉండాలని నివేదికలో తెలిపిందన్నారు. దేశంలో 30 కోట్ల మంది దళిత ,గిరిజనులు నేటికీ వివక్షత ఎదుర్కొంటు న్నారన్నారు. జనాభా ప్రాతిపదికన సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని , ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ 1989 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1950 రాష్ట్రపతి ఆర్డర్ ను రద్దు చేయాలని, లేదా సవరించాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆస్క్ నాయకులు ఉందుర్తి సుబ్బారావు, వల్లూరి రాజేష్, బుజ్జి ,చిన్ని లోవరాజు, ఉల్లం రవి, జయరాజు, చెక్క నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com